
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 7 మార్చి 2025



అంగన్‌వాడీల్లో కొలువుల పండుగ

- రేపు నోటిఫికేషన్ విడుదల
- టీచర్లు, ఆయాలకు ఇంటర్మీడియట్ అర్హత
- జిల్లాలో 557 అంగన్‌వాడీ కేంద్రాలు
- నిరుద్యోగ మహిళల్లో ఆశలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు అంగన్‌వాడీల్లో కొలువుల పండుగ మొదలు కానుంది. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు(ఆయాలు) ఖాళీల భర్తీ చేయనున్నట్లు స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క వెల్లడించడంతో నిరుద్యోగ మహిళల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. గర్భిణీ, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు పూర్వవిద్య కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టి పెట్టారు. ఇప్పటికే జిల్లాలో కొన్నికేంద్రాలను ప్రీస్కూళ్లుగా మార్చారు. అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ విద్య అందించే దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాల్లో 43 వేల మంది లబ్ధి పొందుతున్నారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా 18,645 మందికి పౌష్టికాహారం, ఆరు నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు బాలామృతంతో పాటు 16 కోడిగుడ్లు, హోం రేషన్ అందిస్తున్నారు. 15,804మంది చిన్నారులకు ఒక్కపూట సంపూర్ణ భోజనం, గుడ్డు, పాలు కుర్‌కురే వంటి స్నాక్స్‌లు అందిస్తున్నారు. జిల్లాలో సమర్థవంతంగా అంగన్ వాడీ కేంద్రాలు కొనసా గుతున్నప్పటికీ ఎక్కువ సంఖ్యలో ఖాళీలు ఉండడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో అక్షరాలు రాయిస్తున్న టీచర్(ఫైల్)

● 43 టీచర్లు, 174 ఆయా పోస్టులు ఖాళీ..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 20మినీ కేంద్రాలు ఉండగా, వాటిని పూర్తిస్థాయి కేంద్రాలుగా మార్చారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో రిటైర్‌మెంట్ ప్రక్రియను అమల్లోకి తేవడంతో జిల్లాలో 122పోస్టులు ఖాళీ అయ్యాయి. గతంలో ఉన్న ఖాళీల తో కలుపుకొని జిల్లాలో 217పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. భర్తీకి కసరత్తు మొదలుపెట్టినా ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ రావడంతో నిలిచిపోయింది. ప్రస్తుతం కోడ్ ముగియడంతో మార్చి8తరువాత నోటిఫికేషన్ జారీ కానుంది. జిల్లాలో 43 టీచర్లు, 174 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో 362 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 30 టీచర్ పోస్టులు, 105 ఆయాపోస్టులు, వేములవాడ ప్రాజెక్ట్‌పరిధిలో 225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 13టీచర్ పోస్టులు, 69 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెద్దమొత్తంలో పోస్టులభర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో నిరుద్యోగులకు ఊరటగా మారనుంది.

● ఈసారి ఇంటర్ అర్హత..

అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో టీచర్లకు పదోతరగతి, ఆయాలకు 7వ తరగతి విద్యార్హతగా ఉంది. ప్రీస్కూల్‌గా మార్చి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పూర్వ విద్యను అందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈసారి టీచర్లు, ఆయాలకు ఇంటర్మీడియట్ అర్హతగా నిర్ణయించారు. టీచర్లు, ఆయాలకు వయస్సు18 నుంచి 35ఏళ్లుగా నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా సంక్షేమశాఖ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఖాళీల నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. మార్గదర్శకాలు రావడంతో కలెక్టర్ నోటిఫికేషన్‌ను ఇవ్వనున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- టీజీవో అధ్యక్షుడు సమరసేన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న సమరసేన్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీజీవో అధ్యక్షుడు సమరసేన్, డోర్స్(డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల) అధ్యక్షుడు, జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ మహిళలకి సమానమైన హక్కులతోపాటు ప్రత్యేకమైన చట్టాలను కూడా ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డోర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సూపర్‌వైజర్ నిర్మల దేవి, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా, దేవిక సఖి ఇన్‌చార్జి విజయ, అనుపురం మహిళలు పాల్గొన్నారు. అలాగే సఖి ఆధ్వర్యంలో నర్సింగ్ కాలేజీ కేంద్రంలోనూ మహిళలకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబా యి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మిషన్ భగీరథ ఈఈ జానకి, గెజి టెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, డీఆర్డీవో శేషాద్రి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

వేములవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలోని కార్మికుల సమస్యల పట్ల అసెంబ్లీలో చర్చించి పరిష్కరించే విధంగా చూడాలని గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాసు వేణు అన్నారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం వేములవాడలోని రెండవ బైపాస్‌లో పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. అనంతరం వారు వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమ్మె కాలంలో తమ వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా బడ్జెట్ సమావేశాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. బడ్జెట్ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండల అధ్యక్షులు వర్కోలు మల్లయ్య, బూర శ్రీనివాస్ గౌడ్, అక్కుల అంజాగౌడ్, లోకిని శ్రీనివాస్, సందెల మహేష్, ముదిగం అనిల్, నారాపురం నర్సయ్య, నర్సయ్య, కంసాని రవీందర్ పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

సిరిసిల్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దంతాల సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు అన్నారు. దంతాల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ దంత వైద్యులు, విద్యార్థులు 2కే రన్ నిర్వహించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవం నేపథ్యంలో డెంటల్ అసోసిసేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు దంతాలపై అవగాహన కల్పిస్తూ సిరిసిల్ల అంబేద్కర్‌చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు, కార్యదర్శి డాక్టర్ సతీష్, కోశాధికారి డాక్టర్ శ్యాం, వైద్యులు విజయ్, రాజేందర్, కే గోపి, అన్వేష్, సీహెచ్ సంతోష్, పూర్ణచందర్, శివరామకృష్ణ, ఎ సంతోష్, కీర్తిప్రియ, స్రవంతి, ఓం బ్రహ్మం, స్నేహ, గీత, ఆకాంక్ష, సంధ్య, రమ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సౌజన్యంతో టీస్టాల్ ప్రారంభం

సిరిసిల్ల టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మెప్మా సౌజన్యంతో గురువారం సిరిసిల్ల పట్టణం బతకమ్మ ఘాట్ వద్ద డీఆర్‌డీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య సమక్షంలో పొదుపు సంఘం మహిళలు టీస్టాల్‌ను ప్రారంభించారు. విక్రయదారుల కు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహాలక్ష్మి మహిళ పొదుపు సంఘానికి వీధివిక్రయ కేంద్రాన్ని కేటాయించగా మ హిళలు టీస్టాల్‌ను ప్రారంభించారు. పొదు పు సంఘం మహిళలు పాల్గొన్నారు.

రైతులు ఉద్యమిస్తున్నా స్పందించని ప్రభుత్వం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్


రైతుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న రమేష్

ఇల్లంతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కోసం రైతులు నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ పేర్కొన్నారు. సాగునీటి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన నిరాహారదీక్ష గురువారానికి 4వ రోజుకు చేరగా సీపీఎం నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్‌ఎం 6 కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోలేదని, రైతుల ప్రభుత్వం అని పేర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో జిల్లాకమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య, జవ్వాజి విమల, రాయమల్లు, గురిజాల శ్రీధర్, రామంచ అశోక్,ప్రభాకర్, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం..

సాగునీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తామని, రైతులు చేపట్టిన దీక్ష విరమించాలని డీఈ సీతారామరాజు సూచించారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ సమీపంలో రెండు మండలాల రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష వద్దకు గురువారం చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. కొంత మేర రైతులకు పరిహారం చెల్లించవలసి ఉన్నందున పనులు పూర్తికాలదేన్నారు. రైతులు సహకరించాలని కోరారు. రైతులు మాత్రం తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభిస్తేనే దీక్ష విరమిస్తామని, అంతవరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతులతో మాట్లాడిన వారిలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ షఫీ తదితరులు ఉన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ రహదారుల భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెండింగ్ రోడ్లు, భవనాల పనుల పురోగతిపై ఆర్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు భవనాల శాఖ పరిధిలో 12 రోడ్లు, 8 భవనాలు (వైద్య కళాశాలతో సహా), 7 బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు భవనాల శాఖ పరిధిలో పెండింగ్ రహదారి పనులు చేపట్టి త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ఏదైనా తాత్సారం ఉంటే వివరాలు అందించాలని, ప్రభుత్వానికి లేఖ రాసి బిల్లుల చెల్లింపు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రతి రోడ్డు నిర్మాణ స్థితిగతుల గురించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్ వాటిని వేగవంతంగా పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యల పలు సూచనలు చేశారు. ప్రస్తుత త్వరగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే రోడ్డు నిర్మాణ పనులు ప్రాధాన్యతతో చేపట్టాలని అన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు ఎక్కడ ఇసుక సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రామాణాలుతో చేపట్టాలని అన్నారు. వీర్నపల్లి దగ్గర పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయింపులు చేయాలని కలెక్టర్ సంబంధిత తహసిల్దార్‌కు చరవాణిలో ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ కూడా ముగిసిందని అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పనులు వెంటనే జరిగేలా చూడాలని తెలిపారు. కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి పనులు క్షేత్రస్థాయిలో త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని అన్నారు. డీఎంఎఫ్‌టీ పరిధిలో పెండింగ్ ఉన్న బిల్లుల వివరాలను సమర్పించాలని, వెంటనే చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రూ 166 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల పనులు పురోగతిలో ఉన్నాయని వీటిని నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, ఎల్లారెడ్డిపేట మండలంలోని వీర్నపల్లి వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముస్తాబాద్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం, కోర్టు భవనాల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బి ఈ.ఈ. వెంకటరమణయ్య, డి. ఈ.లు శాంతయ్య, కిరణ్ కుమార్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదవి కోసం కేటీఆర్‌ను నిందిస్తున్న కేకే

- సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మధు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్) మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో మంచి పదవులు రావడం కోసమే కేకే మహేందర్‌రెడ్డి మాజీ మంత్రి కేటీఆర్‌ను నిందిస్తున్నాడని బీఆర్ఎస్ నాయకుడు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల ప్రాంతంలో ఏ ఒక్క ప్రాజెక్ట్ కట్టలేదని, అభివృద్ధి చేయలేదని కేకే మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలో మిడ్‌మానేరు, మల్కపేట,అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లను ఎవరు కట్టించారో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. సిరిసిల్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేటీఆర్‌ను ఏకవచనంతో విమర్శిస్తే ప్రతిఘటిస్తామన్నారు. ఈ సమావేశంలో తాజా మాజీ ఎంపీపీ పడిగెల మానసరాజు, మాజీ సర్పంచ్ కోయ్యాడ రమేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, నాయకులు బండి జగన్, అమరేందర్‌రావు, గుంటి ప్రేమ్‌కుమార్, కురుమ రాజయ్య, కందుకూరి రామాగౌడ్, కరుణాకార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలతో బీఆర్ఎస్ రాజకీయం..

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య


9వ ప్యాకేజీ కాల్వను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల కాలంలో రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో అన్నదాతలతో రాజకీయం చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పాలన సాగిస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులోని మల్కపేట జలాశయం 9వ ప్యాకేజీ కాల్వను ఆ పార్టీ నాయకులు, రైతులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని సాగు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా ఎగువ ప్రాంతానికి సాగు నీటి విడుదలకు కృషిచేసిందన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు రైతుల పంటలు ఎండిపోకుండా అధికారులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి 0.50 టీఎంసీల నీటిని మల్కపేట జలాశయానికి ఎత్తిపోసి అక్కడినుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా విడుదల చేసేలా శ్రమించారన్నారు. పదేళ్ల కాలంలో 9వ ప్యాకేజీ కాల్వను పట్టించుకోని బీఆర్ఎస్ రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గు చేటని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటలకు నీరందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటోందని స్పష్టం చేశారు. నాయకులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, గౌస్, బాబు, శ్రీనివాస్, బాలయ్య, గణపతి, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, నర్సింలు, అంజిరెడ్డి, వెంకటేశ్, లక్ష్మణ్, బాల్‌రెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అనుమతులు కలిగి ఉండాలి

వేములవాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వాహనాలకు తగిన అనుమతి పత్రాలు కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రహదారిలో ఆయన పలువురు వాహన యజమానులతో మాట్లాడారు. వాహన యజమానులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ ఆధారిత ట్రాక్టర్లను ఇసుక తరలింపునకు వినియోగిస్తున్నారని ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. తనిఖీల సమయంలో పట్టుబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంట ఎంవీఐ వంశీధర్ ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

సిరిసిల్ల రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన రెడ్డబోయిన గోపీని గురువారం సిరిసిల్ల పట్టణంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుస్వామి రాచ విద్యాసాగర్, కమిటీ సభ్యులు ప్రయాకరావు మధుసూదన్, గడ్డం భగవాన్, బోప్ప దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలికి..

కోనరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పల్లం అన్నపూర్ణ, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలుగా తీగల జయశ్రీలు నియామకం కాగా, వారిని మండల బీజేపీ అధ్యక్షుడు బాలాజీ, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో సంవత్సరాల తరబడి ఆయాలుగా పనిచేసిన వారికి ఇటీవల నిర్వహించిన బోన్ టెస్టుల ఆధారంగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఏవో రాంరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో బోన్‌టెస్ట్‌లు చేయించుకుని రిపోర్ట్ తెచ్చుకున్న వేములవాడ శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన గుడిసె సత్తవ్వ, వెంకటాంపల్లికి చెందిన నీరుపట్ల మల్లమ్మ, తిప్పాపూర్‌కు చెందిన పందిళ్ల లక్ష్మీ, దుంద్రుపల్లికి చెందిన మడిచెలిమెల నర్సమ్మలకు తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరారు.

యువకుల సమస్యలు అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యువకుల సమస్యలను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గురువారం అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం యువకుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సమావేశంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, నాయకులు సాదుల్, రఘు, మహేష్, ప్రశాంత్‌రెడ్డి, దొంతుల శంకర్, హరి, ప్రేమ్, దుర్గయ, తిరుపతిరెడ్డి, అంతగిరి భాస్కర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ విద్యార్థుల వార్షికోత్సవ హంగామా


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిరిసిల్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఈడీ విద్యార్థులు ఆట పాటలతో హంగామా చేశారు. గురువారం సిరిసిల్లలోని పద్మనాయక కళ్యాణ మండపంలో జ్యోతి బీఈడీ, డీఈడీ కళాశాలల వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వార్షికోత్సవంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు..

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వనిత

సిరిసిల్ల టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన పావనిగౌడ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత ఖండించారు. గురువారం సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో వనిత మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే జర్మనీ రమేష్‌బాబును సమస్యల పరిష్కారం కోసం కలిసే పరిస్థితులు ఉండేవి కావన్నారు. ప్రస్తుతం అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను విమర్శించే నైతిక హక్కు పావనిగౌడ్‌కు లేదన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గరలో ఎండిపోయిన కెనాల్ దృశ్యాలను చూపిస్తూ వేములవాడలో అంటూ ప్రజలు, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకనైన అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు.

ఘనంగా చౌడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం

కోనరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో చౌడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి శనివారం వరకు చౌడమ్మ నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



మధుర ఫలం ఖర్జూరం

● పరిపూర్ణ ఆరోగ్యం, సౌందర్యానికి వరం
● రంజాన్ సంప్రదాయ ఫలం ● పోషకాలు ఎన్నో..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు ఉన్న ఎడారి పండు ఖర్జూరం. ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్న ఖర్జూర ఫలంతోనే ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాసాన్ని విరమిస్తారు. మహ్మద్ ప్రవక్త ఖర్జూర ఫలాన్ని ఎంతో ఇష్టంగా ఆరగించేవారని, అందుకే ఖర్జూర ఫలం ముస్లింలకు సంప్రాదాయ ఫలంగా మారిందని చెబుతారు. అందుకే సాధారణ రోజుల్లో ఖర్జూరం మార్కెట్‌లో తక్కువగా కనిపించినా రంజాన్ మాసంలో ఎక్కువగా దిగుమతి అవుతాయి.

40 రకాల ఖర్జూర పండ్లు ఇప్పుడు మార్కెట్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. గల్ఫ్ దేశాల నుంచి అందులో అత్యధికంగా సాగుచేసే ఇరాక్, ఇరాన్, సౌదీఅరబ్, యెమెన్, అల్జీరియా, మొరాకో దేశాల నుంచి 80శాతం వరకు హైదరాబాద్, బెంగుళూర్ వంటి నగరాలకు లక్షలాది టన్నులు దిగుమతి అవుతుంది. ఖర్జూర పండ్లలో అత్యంత ఖరీదైదని అజ్వా ఖర్జూరం కిలో రూ.1800 నుంచి రెండు వేల వరకు ధర పలుకుతుంది. మిగతా రకాలు రూ.60 నుంచి రూ.600 వరకు ఉంటాయి. ఖర్జూరం రుచికరంగా ఉండడమే కాకుండా పోషకాలు మెండుగానే ఉంటాయి.

ఖర్జూరంలో ఉండే పోషకాలు..

ఖర్జూర పండ్లలో పోషకాలు, ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో గ్లూకోజ్, ఫ్రూటోజ్ వంటి ప్రకృతి సిద్ధమైన చక్కెర పదార్థాలు ఉంటాయి. దీంతో శరీరంలో త్వరగా కలిసిపోయి శక్తినిస్తాయి. వంద గ్రాముల ఖర్జూర పండ్లలో నీరు 15.3 శాతం, ప్రోటీన్‌లు 2.5 శాతం, కొవ్వు 0.4 శాతం, కార్బోహైడ్రేట్ 75.8 శాతం ఉంటాయి. 120ల మిల్లీ గ్రాముల కాల్షియం, 50 మిల్లీగ్రాముల పాస్ఫరసం, 7.3 మిల్లీ గ్రాముల ఇనుము, 3 మీల్లీగ్రాముల విటమిన్ సీ, కొంత విటమిన్ బీ వంటివి ఉంటాయి. ఖర్జూరం ద్వారా కొలస్ట్రాల్ పెరుగుతుందనే భయం కూడా లేదు. వంద గ్రాముల్లో 315 క్యాలరీలు ఉన్నాయి.



ఖర్జూరం నిల్వ ఉంచుకునే పద్ధతి..

ఖర్జూరం పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వీటిని నిల్వ ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. గాలి చొరబడకుండా డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచితే ఖర్జూరం పండ్లు నెలరోజులు నిల్వ ఉంటాయి. ఎక్కువ ఖర్జూరాలు నిల్వ ఉంచుకోవాలనుకుంటే మరికొన్ని పద్ధతులు ఉంటాయి. ఖర్జూరాలు ప్రాసెసింగ్ ద్వారా పంచదార, జామ్, జెల్లి, జ్యూస్, సిరప్‌గా మార్చి విక్రయిస్తుంటారు.

మహిళలకు ఎంతో ఉపయోగం..

ఆరోగ్యం, సౌందర్యాన్ని పెంచే ప్రకృతి ఫలమైన ఖర్జూరం మహిళలకు ఎంతో ఉప యోగపడుతుంది. మహిళల్లో పోషక లోపం ఎక్కువగా ఉంటుంది. ఖర్జూరం వారికెంతో శక్తిని స్తుంది. ప్రతిరోజు గ్లాసు పాలతో ఖర్జూరాలను తింటే పరిపూర్ణ ఆరోగ్యాన్ని స్తుంది.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి తండాకు చెందిన అజ్మీరా రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని అజ్మీరా రాంసింగ్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రహదారి పనులను ఈనెల 4న స్థానిక వాటర్ ట్యాంకు నుంచి కెనాల్ వరకు చేపట్టాడని పేర్కొన్నారు .అదేరోజు అజ్మీరారాజు తన వ్యవసాయ పొలం నుంచి ఎందుకు సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని రాంసింగ్ భార్య లక్ష్మీ, అతని కొడుకు సాయి కుమార్‌లను ప్రశ్నించాడని చెప్పారు. అంతటితో ఆగని అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు రోడ్డు పనులు చేస్తే చంపి వేస్తానంటూ దాడికి దిగాడని తెలిపారు. బాధితుడు రాంసింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

ప్రాణం తీసిన ఇసుర్రాయి వివాదం

● గోదావరిఖనిలో వృద్ధురాలి ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని రమేష్‌నగర్‌లో ఇసుర్రాయి (తిరగలి) విషయంలో తలెత్తిన వివాదం ఒక వృద్ధురాలి ఆత్మహత్యకు దారి తీసింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్లెర్ల యశోద(65) గోదావరిఖని రమేష్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి పొరుగున ఉండే మాశెట్టి కళావతి ఇంట్లో ఇటీవల శుభకార్యం జరిగింది. ఆ శుభకార్యానికి యశోద ఇంట్లోని ఇసుర్రాయిని తీసుకెళ్లారు.



పల్లెర్ల యశోద(ఫైల్)

రోజులు గడిచినా ఇవ్వకపోవడంతో తిరిగి ఇవ్వమని యశోద అడిగింది. అది కనిపించడం లేదని వారు దురుసుగా సమాధానం చెప్పారు. ఈ విషయమై కళావతి, యశోద మధ్య గురువారం గొడవ జరిగింది. కళావతి కోడలు రమ్యశ్రీ అక్కడికి వచ్చి యశోదను తిట్టింది. కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీ కలిసి యశోదను నెట్టివేయడంతో ఆమె కిందపడి పోయింది. స్థానికులు యశోదను లేపి ఇంట్లోకి పంపారు. కాలనీవాసుల ముందు తనను అవమానపరిచారనే మనోవేదనతో యశోద ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. యశోద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు మాశెట్టి కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ తెలిపారు.

గొర్రెలు మాయంపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ముగ్గురు మాంసం విక్రయదారులకు చెందిన ఐదు గొర్రెలు మాయంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిర్యాల్‌కార్ శ్రీకాంత్, మిర్యాల్‌కార్ రాజేశ్, మిర్యాల్‌కార్ ఐలోజీలు కలిసి 14 గొర్రె పొట్టేళ్లను వెంకటాపూర్ సంతలో కొనుగోలు చేసి వారి మందలో విడిచిపెట్టారని తెలిపారు. ఈ నెల 4న మందను అదే గ్రామానికి చెందిన ఒగ్గు ఎల్లయ్య మేత కోసం రెండవ బైపాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్లాడు. సాయంత్రం గొర్రెల షెడ్డుకు చేరుకున్న మందలోని 5 గొర్రెలు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేల విలువైన తమ జీవాలను అపహరించారని పేర్కొంటూ బాధితుడు మిర్యాల్‌కార్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. కాగా మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి పోలీసులు ఐదు గొర్రెలను స్వాధీనపర్చుకుని తమకు అప్పగించారని బాధితులు పేర్కొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- రెండు గ్రామాల్లో విషాదం

చొప్పదండి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన చొప్పదండి మండలంలోని రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ప్రేమికులు ఇద్దరు చొప్పదండి మండలానికి చెందినవారు. చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్‌కుమార్ కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భూపాల పట్నంకు చెందిన నాంపల్లి అలేఖ్య కరీంనగర్‌లో డిగ్రీ చదివింది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారగా అలేఖ్యకు ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీంతో తమ పెళ్లి కాదు అనుకొని ప్రేమికులు ఆత్మహత్యకు పాల్పడడం విషాదాన్ని నింపింది. అలేఖ్య తండ్రి బతుకుదెరువు కోసం గల్ఫ్‌లో ఉంటుండగా, కూతురు మరణవార్త విన్న తల్లిదండ్రి తల్లడిల్లిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో పెళ్లి చేద్దామనుకున్న అలేఖ్య, అరుణ్ కుమార్ మరణ వార్త ఇరువురి కుటుంబాలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామలక్ష్మణపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై సీహెచ్ గణేశ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పొలాల వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.13,340 తోపాటు కారు, నాలుగు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. పీసీలు సంతోష్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

- మరో యువకుడికి తీవ్రగాయాలు

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఉదయ్(25) అనే యువకుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఉదయ్, మరో యువకుడు మంథనిలో జరిగిన తన స్నేహితుడి చెల్లి పెళ్లికి వచ్చారు. అనంతరం రాత్రి ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో స్నేహితుడి ఇంట్లో పడుకోవటానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడగా ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన పెర్క రాయమల్లు (57) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు భార్య కొంతకాలం క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగగా స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

● విధుల్లో నిర్లక్ష్యం వహించాడని కలెక్టర్ వేటు

కోరుట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహించడం, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు గౌరవ పారితోషికం పంపిణీలో జాప్యం వహించడం తదితర కారణాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బ్యాంకు ఖాతాల్లో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సంబంధించిన బడ్జెట్‌ను జమ చేసినప్పటికీ వారి ఖాతాలకు బదిలీ చేయడంలో నిర్లక్ష్యం వహించాడని, శానిటేషన్ నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అనుమతి లేని లే అవుట్స్‌ను నిరోధించడంలో విఫలం కావడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో నిర్లక్ష్యం వహించాడన్న కారణాలతో కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన స్థానంలో కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణకు పూర్తి అడిషనల్ చార్జిని అప్పగిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

జగిత్యాల రూరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని తారక రామ్‌నగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే రఫీ(28) అనే వ్యక్తి ఈ నెల1 టీఆర్‌నగర్ శివారు ఎస్సారెస్పీ కాలువ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. దీంతో తండ్రి ఎస్‌కే రజాక్ తన కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రఫీక్ హత్యకు గురైనట్లు విచారణ జరిపి నిందితులను గుర్తించారు. హత్యకు పాల్పడ్డ నిందితులైన మహమ్మద్ రంజానీ, షేక్ మహమ్మద్, షేక్ శాదవ్‌లను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి సీఐ నీలం రవి, మల్యాల సీఐ పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యం పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● తెలుగు రాష్ట్రాల్లో 50 మందిని నమ్మించి రూ.6 లక్షలు వసూలు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి

సిరిసిల్ల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా గౌరీబిందనూర్ తాలూకా నగిరెగెరే గ్రామానికి చెందిన అజయ్ (20) అనే నకిలీ వైద్యుడిని గురువారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన అజయ్ అనే నకిలీ వైద్యుడు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్రవాహనంపై సంచరిస్తూ అనారోగ్యానికి గురైన అమాయక ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉన్న పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో తగ్గిస్తామంటూ రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసి మళ్లీ వచ్చి వైద్యం చేస్తానని చెప్పి వెళ్లిపోతుంటాడు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అనంతపూర్, మహబూబ్ నగర్, నారాయణఖేడ్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిందితుడు సంచరిస్తూ అమాయక ప్రజలను నమ్మి మోసం చేస్తుంటాడు. ఇదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, శాత్రాజపల్లి, ముస్తాబాద్ మండలంలోని బద్నకల్, వెంకట్రావుపల్లిలో తిరుగుతూ నవంబరు 12, 2024న గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు వచ్చి కొడిమోజు లక్ష్మి భర్త ప్రభాకర్‌కు పక్షవాతం ఉందని తెలుసుకొని వారింటికి వెళ్లాడు. వ్యాధిని నయం చేస్తానని నమ్మించి ఆమె దగ్గర రూ.20 వేలు ఫోన్‌పే చేయించుకోవడమే కాకుండా బ్లాంకెట్లను తీసుకొని మందులు తెస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇలా పలు గ్రామాల్లో నకిలీ వైద్యం పేరిట నమ్మించి దాదాపు రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. గంభీరావుపేటలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50మందిని మోసం చేశానని అజయ్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా కృషి చేసి ఎస్‌ఐ శ్రీకాంత్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అజయ్

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

ఇల్లంతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం రజనీకాంత్(26) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రజనీకాంత్ తంగళ్లపల్లి మండలం జిల్లెల క్రాసింగ్‌కు వెళ్లి గురువారం రాత్రి ఇంటికి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో వాహనంతో సహాపడి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావిలో నుంచి తీయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మామిడి రామకృష్ణ, పిట్టల శ్రీనివాస్, మేకల రమేష్‌లు టీఎస్ 25 టీ 6542, టీఎస్ 25 టీ 6622 అనే రెండు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా టిప్పర్లలో ఇసుక నింపిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్, ఓనర్ ఐలి కరుణాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

బైకు, రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

● కారులో బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం
● ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బైకు.. రెండు ఆటోలను ఢీకొట్టి ఓ కారు బోల్తా పడ్డ ఘటనలో ఒకరు తీవ్రంగా, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. గురువారం శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్స్‌లతో కలిసి కారులో కరీంనగర్‌లోని ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయగూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోతో పాటు టాటా ఎస్ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోడ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బైకుపై ప్రయాణిస్తున్న మానకొండూర్ మండలం శంషాబాద్‌కు చెందిన డొల్ల సతీష్, టాటా ఏసీ డ్రైవర్ తాడికల్‌కు చెందిన పెరిక రాజమల్లుకు స్వల్ప గాయాలయ్యాయి. పెరిక రాజమల్లును 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని ప్రమాదంపై విచారణ చేపట్టారు.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రమాదంలో ధ్వంసమైన టాటా ఏస్ ఆటో

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ



దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ చోరీ తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మల్హార్‌రావు మండల్ రెడ్డిపల్లికి చెందిన బొరిగం సంపత్ తన తల్లి చనిపోగానే తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. ఇంట్లో పరిస్థితులు అనుకూలించక చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో 2005లో దొంగతనానికి పాల్పడి అదే వృత్తిగా ఎంచుకున్నాడు. గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, హన్మకొండ, మంథని, కొయ్యూరు, హసన్‌పర్తి తదితర ఏరియాల్లో దొంగతనాలకు పాల్పడి 36 కేసుల్లో జైలు జీవితం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మళ్లీ అదే వృత్తిని కొనసాగించాడు. ఇదే క్రమంలో ఈ నెల 2న కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లికి చెందిన మద్దెల శాంతమ్మ ఇంట్లో ఎవరు లేని సమయంలో చొరబడి బీరువా తాళం పగుల గొట్టి నగదు బంగారం దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తారుపల్లి వద్ద గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సంపత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి 2 లక్షల 25 వేల నగదు, 149 గ్రాముల బంగారం సుమారు(13 లక్షలు) ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్బారెడ్డి, వెంకటేష్, సిబ్బంది అశోక్, లక్ష్మన్, వినుస్తర్, రవీందర్, ప్రభాకర్, రమేష్, రాజు, రాజ్‌కుమార్, లను ఏసీపీ అభినందించారు. దొంగను కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్‌లో ఇద్దరు

● సుల్తానాబాద్: ఇళ్ల తాళాలు పగులకొట్టి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. సుల్తానాబాద్ మార్కండేయ కాలనీకి చెందిన వేముల చంద్రప్రకాష్, సుల్తానాబాద్ గాంధీనగర్‌కు చెందిన భైరి కిరణ్ ఇద్దరు కలసి అనేక దొంగతనాలకు పాల్పడ్డారు. వేముల చంద్రప్రకాష్ గంజాయి కేసుల్లో కూడా పలు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. గత జనవరి 17న గాంధీనగర్‌లోని వంగల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో ఇద్దరు నిందితులు తాళాలు పగులకొట్టి టీవీ దొంగిలించారు. టీవీని అమ్మగా వచ్చిన 20వేల రూపాయలను ఇద్దరు పంచుకున్నారు. వీరి కోసం పోలీసులు గాలిస్తుండగా శాస్త్రినగర్ వద్ద పట్టుబడగా వానిరి అదుపులోకి తీసుకుని ఇరవై వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వేముల చంద్రప్రకాష్‌పై సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు కేసులు, పెద్దపల్లిలో ఒకటి, నిజామాబాద్‌లో ఒక కేసు, కరీంనగర్‌లో ఓ కేసు ఉందని ఎస్‌ఐ సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చొప్పదండిలో ఇద్దరు

● చొప్పదండి: చొప్పదండిలో కాపర్‌వైర్ దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. చొప్పదండిలోని శ్రీరామ ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రానిక్స్ గోదాంలో ఉన్న కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని మంగళవారం ఫిర్యాదు చేయగా, గురువారం చొప్పదండి బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక పెద్ద సంచితో అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. ఇద్దరిని పట్టుకొని తనిఖీ చేయగా కాపర్ వైర్లు కనిపించాయని, విచారించగా దొంగలించిన సొత్తుగా గుర్తించి గోగులకొండ మహేష్, కడారి అభిషేక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గోగులకొండ మహేష్, రామ్‌టెక్ శివప్రసాద్, కడారి అభిషేక్‌లు స్నేహితులుగా ఉంటూ ఈజీ మనీ కోసం దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రుద్రవ రం రాజు(47) గురువారం మృతి చెందాడు. రాజు మృతిపై అనుమానాలు న్నాయని మృతుడి తల్లి రుద్రవరం సుగుణ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజు కడుపులో ఇన్‌ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురయ్యాడని, అతడి భార్య పట్టించుకోలేదని, బుధవారం తమ కొడుకును చూసేందుకు వెళ్లగా బయటకు గెంటేశారని, గురువారం ఉదయం రాజు మృతి చెందినట్లు సమా చారం అందించారని పేర్కొంది. కానిస్టేబుల్ రాజు మృతికి అతని భార్య, ఆమె తల్లిదండ్రులు, ఒక కానిస్టేబుల్ మరి కొందరిపై అనుమానాలున్నాయని తెలిపింది. దీనితో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి

● నృత్యం చేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లిలో ఓ పెళ్లి ఊరేగింపులో గురువారం అపశ్రుతి చోటు చేసుకున్నది. పెళ్లి ఊరేగింపు జరుగుతుండగా ఓ కారు నృత్యం చేస్తున్నవారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నరేందర్‌రెడ్డి విమర్శనాస్త్రాలు ఎవరిపై?



● లోటుపాట్లపై నివేదిక ఇస్తానని ప్రకటన
● మూడు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయని ఆవేదన
● జిల్లాలో నాయకత్వ లోపముందని వ్యాఖ్య

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోరాడి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి తన ఓటమికి గల కారణాలు, ఎన్నికల సందర్భం లో జరిగిన లోటుపాట్లపై పార్టీ నాయకత్వానికి నివేదిక ఇస్తానని ప్రకటిం చారు. కాంగ్రెస్‌కు జిల్లాలో నాయకత్వ లోపం ఉందని, దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తానని వాఖ్యానించడం పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తక్కు వ వచ్చాయని, కరీంనగర్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయంగా ఎవరిపై బాణం ఎక్కుపెట్టారని చర్చించుకుంటు న్నారు. ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యకర్తలు తన వద్దకు రావడానికి కొంత మంది అనుమతి తీసుకోవలసిన పరిస్థితి ఎదుర్కొన్నారని, పార్టీలో గ్రూపు రాజకీయాలు ఉన్న నేపథ్యంలో సమన్వయం పరిచే నాయకత్వం లోపించిందని నరేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ ప్రక్షాళనకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన డంతో ఆయన ఎవరిపై ఫిర్యాదు చేయనున్నారు అన్నది చర్చనీ యాంశంగా మారింది.

అన్ని వేళ్లూ అటు వైపే..

నరేందర్‌రెడ్డి ఓట్లు తక్కువ వచ్చాయని పేర్కొన్న మూడు నియోజక వర్గాల్లో సిరిసిల్ల మినహా మిగతా రెండింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాలు కరీంనగర్ పార్లమెం ట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో మంత్రి పొన్నం ప్రభాకరే ఇప్పటికీ పూర్తి స్థాయిలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యత వహిస్తున్నారు. నరేందర్‌రెడ్డి అసంతృప్తి ఆయా నియో జకవర్గ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనేనా అన్న చర్చ సాగుతోంది. కరీంన గర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ ఇదివరకే తనకు ఏ స్వేచ్ఛ లేకుండా పోయిందని, నియోజక వర్గ ఇన్‌చార్జిగా తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్‌రావు నిజానికి పార్లమెంట్ ఇన్‌చా ర్జిగా వ్యవహరించాలి. ఆయన పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారో లేదో ఆయనకే తెలియని పరిస్థితి జిల్లాలో నెలకొన్నది.

కరీంనగర్ జిల్లా మొత్తం సుడా పరిధిలోకి వచ్చినా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి పలు సమావేశాలకు ఆహ్వానమే అందడం లేదు. ఈ ముగ్గురు నేతలు కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఉంటూ తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని పరోక్షంగా పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఇప్పుడు నరేందర్‌రెడ్డి కూడా వారి సరసనే చేరా రా... ఆయన పేరు పేర్కొనకపోయినా జిల్లాలో సమన్వయ పరిచే నాయకత్వం లేదనడం మంత్రి ఆ పని చేయడం లేదని పరోక్షంగా చెప్పడ మేనా... అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఒకటికి రెండు సార్లు మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ తన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచారని ప్రకటించడం కూడా ఈ చర్చకు దారితీసినట్ట యింది. ఎన్నికల అనంతరం నరేందర్‌రెడ్డి రాజకీయాల్లో ఉండరు.. ఆయన స్కూల్స్ నడుపుకుంటారని వాఖ్యానించినవారికి జవాబుగా పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి తనకు మరింత బాధ్యతలను పెంచిందని, కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పనిచేస్తూ ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని, ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటానని ప్రకటించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని 42 నియోజకవర్గాలలో తాను గమనించిన సమస్య లను, పట్ట భద్రులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడం రేపటి నుంచే తన కార్యాచరణ ప్రారంభమవు తుందని ప్రకటించడం పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని అన్న నిర్ణయానికి నరేందర్‌రెడ్డి వచ్చారని ఆ పార్టీ నాయకులు అనుకుంటు న్నారు. నరేందర్‌రెడ్డి పార్టీలో లోటుపాట్ల పేరిట ఏ అంశాలు ప్రస్తావి స్తారు.. ఏ నాయకులపై ఫిర్యాదులు చేస్తారు... అన్నదే పార్టీలో సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న అంశంగా మారింది.

కాంగ్రెస్‌వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతా

● కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తన బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతానని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేం దర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా తనపై చేసిన విషప్రచారాన్ని పట్టభద్రులు పట్టించు కోలేదని, తనకు అండగా నిలిచి ఓట్లు వేశారని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు, అల్ఫోర్స్ కుటుంబ సభ్యులకు సీపీఐ, సీపీఎం, టీజేఎస్, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాలకు కృతజ్ఞతలు తెలి పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామో దర రాజన ర్సింహ, పొన్నం ప్రభాకర్‌తోపాటు నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నిర్విరామంగా పనిచేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రచారం, పోలింగ్‌బూత్‌ల మేనేజ్‌మెంట్ వరకు మంత్రే చూసు కున్నారని, తన గెలుపునకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. ఎన్నిక లకు ముందు నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పట్టభద్రులకు ఇచ్చి న హామీల అమలుకు తన కార్యాచరణ ఉంటుందని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.. కాం గ్రెస్‌లో లోటుపాట్లపై పార్టీ పెద్దలకు నివేదిక ఇస్తానని, పార్టీలో స్తబ్దత నెలకొందని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు



రెండు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉపాధినిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం సమయానికి వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఈజీ ఎస్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవిలో ఉపాధిహామీ పథకాన్ని గ్రామాల్లో ఉద్యోగు లు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వర్తించే కార్యాలయ ఉద్యోగుల కు నెల రోజుల వేతనం రాకపోగా, గ్రామాల్లో విధు లు నిర్వర్తించే ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనా లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమ యానికి వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లే కీలకం

ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు కీలకపాత్ర పోషి స్తున్నారు. ఈజీఎస్ ద్వారా రైతువేదికల నిర్మాణాలు, రైతుకల్లాలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతలు, మరు గుదొడ్ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, మొక్కల రక్షణ, కాలువ లు శుభ్రంతో పాటు పలు రకాల పనులను గ్రామా ల్లో చేపడుతున్నారు.

ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సజావుగా నిర్వహిం చేందుకు కీలకపాత్ర పోషిస్తూ పనిభారంగా మారు తున్న అవేమీ పట్టనట్లుగా ఓపికతో నిర్వర్తిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాలకు 30 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు 22 మంది మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ఏపీవో, జేఈ ఒకరు, టెక్నికల్ అసి స్టెంట్‌లు ముగ్గురు, ఒకరు కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు.

ఉదయం నుంచే ఉపాధి పనుల్లో ఉద్యోగులు

తెల్లవారుజాము నుంచే ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డు దారుల వారికి ఉపాధి పనులు కల్పిస్తున్నారు. గ్రామాల వారిగా ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ఆధారంగా కూలీలు పనులు ముగిం చుకొని వెళ్లే వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు పర్య వేక్షిస్తునే ఉంటారు. వీరితో పాటు టెక్నికల్ అసిస్టెంట్ లు, ఉన్నతాధికారులు సైతం ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్నారు. కూలీలకు పనులతోపాటు హరిత హారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు నీరు అం దించడం, నర్సరీల్లో మొక్కల పెంపుదల, పశువుల షెడ్లు అవసరం ఉన్నవారికి అమలు పనుల్లో ఉద్యో గులు నిమగ్నమవుతారు. అధికారులు ఇచ్చిన లక్ష్యాల కు అనుగుణంగా ఉపాధి కూలీలను తీసుకొచ్చే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసుకుంటున్నా ప్రభు త్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది.



పొద్దంతా కష్టపడుతున్నాం.. : సుమలత, కొత్తపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్

గ్రామాల్లో ఉదయం నుంచి చేపడుతున్న పనులను కిందిస్థాయి కూలీలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తిస్తున్నాం. కనీసం ప్రభుత్వం మమ్మల్ని గుర్తించని పరిస్థితి ఉంది. ఓ వైపు లక్ష్యాలు ఇస్తే వాటికి అనుగుణంగా పనులు పూర్తి చేస్తున్నాం. పొద్దంతా కష్టపడుతున్న సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇంట్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రతీ నెల మొదటి వారంలోనే వేతనాలు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలి.



ప్రతి నెల వేతనాలు అందించాలి
రమేష్‌బాబు, ఏపీవో, పెద్దపల్లి

పనులకు అనుగుణంగా సమయా నికి ప్రతీ నెల వేతనాలు అందించాలి. నిత్యం ఫీల్డ్ ఉంటున్న ఈజీఎస్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను సమయానికి అందిస్తే ఆర్థిక ఇబ్బం దులకు గురికాకుండా ఉంటాం.

ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

● ఈ నెల 10 నుంచి ప్రారంభం

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మార్చి 10 నుంచి 22 వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు గోపురాలకు, దేవాలయం లోపల రంగులు వేయించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అందంగా అలంకరణ చేస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయం లోపల, బయట ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఆలయం లోపల, బయట దాతల సహకారంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్యవైశ్య, వర్తకులు, రైస్‌మిల్ యజమానులు, దాత లు, స్వచ్ఛంద సంస్థలు కలిసి భక్తుల సౌక ర్యార్థం బ్రాహ్మణ సంఘం, టీటీడీ ఆవర ణలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ఆలయం లోపల, బయట సోడి యం హైపోక్లోరైడ్ స్ప్రే చేయిస్తున్నారు. భక్తుల కోసం 25 క్వింటాళ్ల పులిహోర ప్రసాదం, ఒక లక్ష లడ్డు ప్రసాదాలు తయారు చేయిస్తున్నారు. 60 సీసీ కెమెరా లు దేవాలయాల పరిసరాల్లో, గోదావరి నదీ తీరంలో, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్య వేక్షిస్తున్నారు. సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తదితరులు ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రాజన్న ఖజానాకు రూ.2.31 కోట్ల నగదు

● బంగారం 201 గ్రాములు, వెండి 16.20 కిలోలు



హుండీ లెక్కింపు చేస్తున్న సిబ్బంది, భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఖజానాకు రూ.2 కోట్ల 31 లక్షల 65 వేల 333 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య గురువారం హుండీలను లెక్కించారు. 201 గ్రాముల బంగారం, 16 కిలోల 200 గ్రాముల వెండి, సమకూరినట్లు తెలిపారు. రాజన్న ఆలయంలో 14 రోజుల హుండీలను లెక్కించామని, మహా శివరాత్రి జాతర సందర్భంగా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

కొండగట్టులో 10నుంచి పవిత్రోత్సవాలు



మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ దేవస్థానంలో ఈ నెల 10 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహి స్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ప్రతియేటా లోక కల్యాణార్థమై త్రయా హ్నిక దీక్షచే మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. పవిత్రోత్సవాల్లో భాగం గా నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పారాయణం, నిర్వహించనున్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీలు

సిరిసిల్ల టౌన్, మార్చు 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్కానింగ్ కేంద్రాలను గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యశ్రీరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. స్కానింగ్ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించి ఫారం ఎఫ్‌లు సరిగా నిర్వర్తించవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యశ్రీరావు మాట్లాడుతూ రేడియా లజిస్ట్, గైనకాలజిస్ట్ డాక్టర్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని అన్నారు. లింగనిర్ధారణ నిషేధిత చట్ట స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలను సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు.

ఈ తనిఖీల్లో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల గైనకాలజిస్ట్ డాక్టర్ సుచిత్రలక్ష్మి, జిల్లా పీవోఎంహెచ్‌ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్, డిప్యూటీ డెమో రాజ్‌కు మార్, హెచ్‌ఈ బాలయ్య, సఖీ కన్సల్టెంట్ రోజా, కానిస్టేబుల్ శ్రీలత, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేష్ పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డాక్టర్ సూర్యశ్రీరావు

యోగా శిక్షకురాలికి జాతీయ అవార్డులు



అన్నపూర్ణ

కోల్‌సిటీటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికి చెందిన యోగా శిక్షకురాలు కొంకన అన్నపూర్ణ రెండు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికైంది. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన శాంతి ఫౌండేషన్ సంస్థ సావిత్రిబాయి పూలే పేరిట వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు ఇంటర్నేషనల్ ప్రైడ్ ఉమెన్ అవార్డులను అందజేస్తుంది. ఈ అవార్డుకు అన్నపూర్ణను ఫౌండేషన్ ఎంపిక చేసింది. హన్మకొండకు చెందిన వినిశెట్టి జగదీశ్వరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఇన్‌స్పైరేషనల్ ఉమెన్ అవార్డుకు అన్నపూర్ణను ఎంపిక చేసింది.

అడుగంటిన పెద్ద చెరువు



● చుట్టూ కాలువలున్నా ప్రయోజనం శూన్యం
● తూము ఏర్పాటు చేయాలని రైతుల విజ్ఞప్తి

మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో పెద్ద చెరువుకు రెం డు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో నీరు లేక వెలవెలబోతోంది. తూము నిర్మిస్తే వేసవిలో పంటలకు సాగు నీరు అందే అవకాశం ఉం ది. చెరువుకు రెండు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో పంటలకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. పెద్ద చెరువు కింద వం దలాది ఎకరాల భూముల్లో రైతులు సాగు చేస్తుంటా రు. ఈ చెరువుకు సమీపంలో నుంచి రెండు పక్కల డీ65, డీ67 ఉప కాలువలు నిండుగా ప్రవహిస్తున్నా యి. ఈ చెరువుపై మనాల శివారులోని దమ్మక్క చె రువు కాకతీయ కాలువ పక్కన ఉండగా అక్కడి నుం చి ప్రస్తుతం నీరు వచ్చే అవకాశం లేదు. దీంతో డీ65 నుంచి తూము ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. తూము ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు గ్రామంలోనూ భూగర్భ జలా లు వృద్ధి చెందుతాయని రైతులు పేర్కొంటున్నారు.

తూము నిర్మించాలి
ముదుగంటి రాజు, మ్యాడంపల్లి

డీ65 ఉప కాలువ నుంచి తూము ఏర్పాటు చేస్తే పెద్ద చెరువు నింపుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తు తం కాలువ వద్ద పైపులు అమర్చి ఉన్నప్పటికీ వాటి నుంచి నీటి మళ్లింపు అంతంత మాత్రమే. దీంతో చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేక పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో తూము ఏర్పాటు చేయాలని అధికారులను కోరాం. మళ్లీ కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తాం.





మ్యాడంపల్లిలో నీరందక ఎండుతున్న వరి, తూము ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం, ఉప కాలువ నుంచి ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్

ఎస్సారార్‌లో ముగిసిన జాతీయ సదస్సు

గణేశ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 'ప్రాచీన తెలంగాణ వాంగ్మ యం ఒక అవలోకనం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. కళాశాల, కరీంన గర్ తెలుగు భాగం, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రాచీన వాంగ్మయ పరిశోధనే జీవధాతు అని అన్నారు. ఇక్కడ జాతీయ సదస్సు నిర్వహిం చడం గొప్పవిషయమన్నారు. ఎందరో సాహితీ ఉద్దండులు నడయాడిన నేలలో కందపద్యంతో తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించడం ఆనందంగా ఉందన్నారు. పద్నాలుగు భాషలు వచ్చిన పండితులు ఇదే నేలలో జన్మించడం, శేషప్ప సిద్ధప్ప వంటి పద్య కవులు విలసిల్లిన కరీంనగర్ భూమి చాలా గొప్పదన్నారు. మనుషులు యాంత్రిక మైపోయిన సమయంలో సదస్సు ద్వారా గొప్ప రచయితలు వక్తలు ఒకచోట చేరడం అభినందనీయమన్నారు. డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, నెల్లూరు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సాగి కమలాకర్ శర్మ, బెనారస్ హిందూ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కళాశాల తెలుగు విభాగ అధిపతి డాక్టర్ భూర్ల చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజయ్య పాల్గొన్నారు.



మట్లాడుతున్న డాక్టర్ వెల్దండ నిత్యానందరావు

అధ్యాపకులకు గైడ్‌షిప్ అవకాశం కల్పించాలి

గణేశ్‌నగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అర్హులైన అధ్యాపకులం దరికీ గైడ్‌షిప్ అవకాశం కల్పించాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్‌రెడ్డి కోరారు. బుధ వారం ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అర్హులైన అధ్యాపకులను పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా గుర్తించాలని, పరిశోధన అవకాశాలు పెంపొందించాలని అన్నారు. యూజీసీ కళాశాల విద్యాశాఖ నిబంధనలను అనుసరించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను క్లస్టర్లుగా గుర్తిం చాలన్నారు. కొన్ని కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు ఉన్నా సంబంధిత కోర్సులు అందుబాటులో లేకపోవడంతో పరిశో ధనలకు ప్రతిబంధకంగా మారిందన్నారు. కళాశాలలను క్లస్టర్‌లుగా చేసి అన్ని విభాగాలను ఒకే యూనిట్ పరిధిలోకి తీసుకొస్తే అడ్డంకులు తొలిగిపోతాయన్నారు. టీజీసీజీటీఏ ఎస్‌యూ కోఆర్డినేటర్ డాక్టర్ కె. మల్లారెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, సంఘం బాధ్యులు డాక్టర్ టి.శ్రీనివాస్, ఎస్.రమేష్ బాబు ఉన్నారు.



వీసీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

న్యూస్ బాక్స్

కళ్లజోళ్లు పంపిణీ

గంభీరావుపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలలో ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వారు గురువారం విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. పాక్షిక కంటిచూపు సమస్యను గర్తించి, 24మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అందించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ధర్మారం రాజిరెడ్డి, ఎల్‌వీ ప్రసాద్, ఇన్‌స్టి ట్యూట్ ప్రతినిధులు రాజు, రవళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

వీర్నపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త తౌటు రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి గురువారం పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు లక్పతి నాయక్, సీనియర్ నాయకులు మాడ్గుల లక్ష్మీరాజం, లింబాద్రి, పీర్యా నాయక్, శ్రీను నాయక్, తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల రక్షణకు చర్యలు

వీర్నపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అడవుల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి సాసర్ పిట్లను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని అడవుల్లో నీటి లభ్యతలేనిచోట్ల సాసర్‌పిట్, రింగ్స్ ఏర్పాటుచేసి అటవీ సిబ్బంది, కూలీలతో నిత్యం నీటిని నింపి ఉంచుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం కృషి చేయాలని అటవీ సెక్షన్ అధికారిని భూలక్ష్మి, బీట్ అధికారి కిరణ్ అన్నారు.

శ్రమదానం

కోనరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిమ్మపల్లి దేవునితండా నుంచి అజ్మీరతండా వరకు గుంతలమయంగా మారిన రహదారికి గిరిజన ఐక్య వేదిక నాయకుడు బానోతు నరేష్ గురువారం శ్రమదానం చేసి బాగు చేశారు. తండావాసులు నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కిషన్ నాయక్, మోహన్ నాయక్, అమృత లాల్, సంతోష్ నాయక్, బిక్కు నాయక్ ఉన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



సిరిసిల్ల పట్టణంలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఎల్లారెడ్డిపేటలోని కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

సిరిసిల్ల రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి, ఇందులో జనరల్ విభాగంలో 3341 మంది విద్యార్థులు వోకేషన్‌లో 378 మొత్తం 3781 మంది విద్యార్థులు హాజరుకాగా 75మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 378 మంది విద్యార్థులకు 365మంది విద్యార్థులు హాజరుకాగా 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలతో పాటు సెస్ బాలిక జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌లు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కళాశాల ప్రిన్సిపాల్‌లు కనకశ్రీ విజయరఘునందన్, వనజ కుమారీలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో సిరిసిల్ల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 244 మంది విద్యార్థులకు 242మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్‌సూపరింటెంట్ మల్లారెడ్డి తెలిపారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ జూనియర్, రాచర్లజూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 203 మందికి ఇద్దరు, రాచర్ల జూనియర్ కళాశాలలో 212 మందికి ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని సీఎస్ లు పర్శరాములు, కనకయ్యలు పేర్కొన్నారు. కేంద్రాల వద్ద భద్రత చర్యలు చేపట్టామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు తొలగించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చంద్రవంక ప్రాజెక్టులో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను తొలగించాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నీటిలో చేపలను పెంచుతున్నామని, దాని చుట్టుపక్కల ఉన్న రైతులు విద్యుత్ మోటార్‌లను ఏర్పాటుచేసుకొని నీటిని పొలాలకు తరలిస్తుండడంతో చేపలు చనిపోయే ప్రమాదం ఉందని వాటిని తొలగించాలని ముదిరాజ్ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌కు గురువారం తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘానికి చెందిన 150 మంది సభ్యులు తరలివచ్చారు. చంద్రవంక ప్రాజెక్టులో ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్‌లను తొలగించి తమకు న్యాయం చేయాలంటూ మత్స్యశాఖ జిల్లా అధికారి సౌజన్యతో పాటు నీటిపారుదల శాఖ ఈఈ అమరేందర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ మాకు జీవనధారమైన చంద్రవంక ప్రాజెక్టులో రైతులు అక్రమంగా విద్యుత్ మోటార్‌లను ఏర్పాటుచేసుకుని నీటిని పంటలకు తరలించడంతో అందలో ఉపాధి కోసం వేసిన చేపలు నీళ్లలేక చనిపోయే ప్రమాదం ఉందని అన్నారు. దీనిపై రెండు సార్లు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని అన్నారు. సెస్ అధికారులకు ఫిర్యాదులు చేస్తే ఆ విద్యుత్‌మోటార్‌లకు సంబంధించిన కరెంట్ వైర్లను తొలగించిన కూడా రైతులు అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లను పెట్టుకుంటున్నారని అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన అంకుసాపూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు

స్పందించి విద్యుత్ మోటార్‌లను తొలగించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కనకచంద్రం, లింగయ్య, లక్ష్మణ్, కోడి శ్రీనివాస్, అంజయ్య,సంతోష్, రాజు, తిరుపతి, ముత్తయ్య, అనందం, కిష్టయ్య, భూమయ్య, కుంటయ్య, రాములు, శంకర్, చంద్రయ్య, బాబు, రాజేశం, అజయ్, మునీందర్, రాజేశం, నాగరాజు, పర్శరాములు, రాజయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు మంత్రి వర్గంలో స్థానాలు కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోనరావుపేట, మారి 6 (ఆంధ్రజ్యోతి) : మంత్రివర్గంలో రెండు స్థానాలు మాదిగలకు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ ఆధ్వర్యంలో డప్పులతో ప్రదర్శన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ యెలగందుల బిక్షపతి మాదిగ హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై డాక్టర్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోటు పాట్లని సవరించి ఈ రాష్ట్రంలో 15 లక్షలు ఉన్న మాల సామాజిక వర్గానికి 5 శాతం కేటాయిస్తే 32 లక్షలకు పైగా జనాభా ఉన్న మాదిగలకు 11 శాతం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. క్యాబినెట్ సమావేశాల్లో ప్రతిపాదనలను అమలయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తైదల రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి దిలీప్,ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, గంగారాం, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్యాల జాన్సన్, మల్యాల మధుకర్, మల్యాల మనోజ్, దప్పుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్) : రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో ఇద్దరు మాదిగలకు చోటుకల్పించడంతో పాటు ఎస్సీ వర్గీకరణలో మాదిగ, ఉపకులాలకు జనాభా ప్రాతిపాదికన 11శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపల్లి బాలయ్య డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు గురువారం జస్టిస్ షమీ అక్తర్ కమిషన్ రిపోర్టులోని అంశాలపై లోపాలను సవరించాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మూడు గ్రూపులు కాకుండా ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రుద్రంగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు గంటె ప్రశాంత్ గురువారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, మాజీ ఎంపీటీసీ మంచే లావణ్య రాజేశం, మాడిశెట్టి ఆనందం, చెప్యాల గణేష్, దయ్యాల కమలాకర్, కాదాసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



సిరిసిల్లలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



వేములవాడలో మిఠాయిలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి రెండవ ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించడంతో సిరిసిల్ల పట్టణంలో గురువారం సాయంత్రం బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఏదుట బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, టపాసులు కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కోకన్వీనర్ అడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, దాసరి శ్రీనివాస్, అంకారపు రాజు, పండుగ మాధవి, మోర రవి, నరేష్, ఊరగొండరాజు, మోర శ్రీహరి, చొప్పదండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● వేములవాడ : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపుపై పార్టీ నాయకులు గురువారం వేములవాడలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద బాణసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, పిన్నింటి హన్మండ్లు, వాసం మల్లేశం యాదవ్, గుడిసె మనోజ్, జవ్వాజి శేఖర్, సగ్గు రాహుల్, వివేక్ రెడ్డి, నేరెళ్ల సాయి, బిల్లా కృష్ణాహరి, బుర్ర మనీష్, తడుక రాజు, అన్నం నర్సయ్య, గొట్టం వెంకటేష్, యశ్వంత్ ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేటలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. నాయకులు బుగ్గారెడ్డి, నరేశ్, లక్ష్మారెడ్డి, అనూష్‌యాదవ్, సాయిలు పర్శరాములు, రాజిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, వేణు, రవి, సంజీవరెడ్డి, కిరణ్‌నాయక్, గాల్‌రెడ్డి, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను బిజెపి కైవసం చేసుకోవడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. విజయోత్సవ ర్యాలీతో పాటు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్, సీనియర్ నాయకులు బోయిని రాజు,మీసాల రవీందర్,పెద్ది శ్రవణ్, అల్లూరి రవీందర్‌రెడ్డి, తుం గంగాధర్, పడాల నరేష్, మ్యాకల పనిందర్, అరిపెల్లి తరుణ్, పవన్, పత్తిపాక వంశి తదితరులు పాల్గొన్నారు

● చందుర్తి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి గెలుపు పట్ల చందుర్తి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి, టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నియోజక వర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, మండల బీజేపీ అధ్యక్షుడు మొకిలే విజేందర్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ పొంచేట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి పెరుక గంగరాజు నాయకులు చిర్రం తిరుపతి, పెరుక రంజీత్, గంగాధర్, శ్రీకాంత్, తిరుపతి, సతీష్, శ్రీనివాస రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇద్దరి మృతి

గంభీరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేటలోని మా అనాథ వృద్ధాశ్రమవాసి వంజరి విఠల్(77) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. నాలుగు ఏళ్ళగా వృద్ధాశ్రమంలో విఠల్ నివాసం ఉంటున్నాడు.

● కోనరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన వడ్డెర కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన దుండగుల కనకయ్య(50) అనే కార్మికుడు బావుసాయిపేట శివారులో బండలు కొట్టడానికి వెళ్లాడు. చాతిలో నొప్పి రావడంతో సిరిసిల్ల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్య కనకవ్వ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లున్నారు.

విరాళాలతో అంత్యక్రియలు

గంభీరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబానికి చెందిన వృద్ధురాలి మృతిచెందడంతో విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. ఐదేళ్ల క్రితం తండ్రి, ఇప్పుడు తల్లిని మృతిచెందడంతో కొడుకు మల్లేశ్ అనాథయ్యాడు. మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన భూదవ్వ(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పేద కుటుంబం కావడంతో ఖరీదైన వైద్యం చేయించుకునే స్థోమత లేక భూదవ్వ గురువారం వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స మృతి చెందింది. ఐదేళ్ల క్రితం భూదవ్వ భర్త నర్సయ్య అనార్యోంతో మృతిచెందాడు. దీంతో కొడుకు మల్లేశ్ అనాథ అయ్యాడు. ఉండేందుకు ఇల్లు కూడా లేకపోవడంతో అందరిని కలిచివేసింది. కుల సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు.

లేగ దూడపై వీధి కుక్కల దాడి

గంభీరావుపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిని లింగారెడ్డి గారి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన లేగ దూడపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీధి కుక్కల కారణంగా ప్రజలు, మూగ జీవాలు గాయాలపాలవుతున్నాయి.

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట..

గంభీరావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలంలో వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. వన్య ప్రాణులను వేటగాళ్ళు యథేచ్ఛగా వేటాడుతూ మాంసాన్ని అమ్ముతూ సొమ్ముకుంటున్నారు. అదే వృత్తిగా వేటగాళ్ళ జీవనోపాధి సాగుతోంది. మండల పరిధిలోని పెద్దమ్మ అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేట కొనసాగుతోంది. ఈమధ్య వేటగాళ్ళు వన్యప్రాణిని చంపి, మాంసాన్ని దర్జాగా అమ్ముతుండగా, సంబంధిత అధికారులు పట్టుకోవడంతో ఈ తతంగం బయటపడింది. వన్యప్రాణి మాంసాన్ని కిలోకు 500 చొప్పున అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. 6నెలల కింద కొండగొర్రె మాంసాన్ని కొత్తపల్లి గ్రామంలోని ఓ ఇంటి వద్ద ఓ వ్యక్తి అమ్ముతుండగా, ఫారెస్ట్ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. అతనిపై వన్యప్రాణి యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. 20రోజుల కింద ముస్తాఫనగర్ గ్రామ సమీపాన వేటగాళ్లు దుప్పిని చంపేసి, మాంసాన్ని యథేచ్ఛగా విక్రయిస్తుండగా, ఫారెస్ట్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. వన్య ప్రాణుల వేటతో పాటు మాంసం అమ్మకాలు ఈ ప్రాంతంలో వేటగాళ్ళకు నిత్య కృత్యంగా మారింది. అధికారులు ఓ వైపు పట్టుకుంటున్నా వారి కళ్ళుగప్పి వేటగాళ్ళు వన్యప్రాణుల వేటను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అధికారులకు దొరకకుండా వన్యప్రాణులను హతమార్చుతూ మాంసాన్ని విక్రయించడమే వేటగాళ్ళ పనిగా మారిందనే ప్రచారం సాగుతోంది. ఏదేమైనా వన్యప్రాణుల రక్షణ కోసం సంబంధిత అధికారులు చర్యలను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 19 గ్రామ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని సంజాయషీ నోటీసులు కలెక్టరు గురువారం రాత్రి అందించారు. జిల్లాలోని కోనరావుపేట, ఇల్లంతకుంట, వేములవాడ రూరల్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 19 మంది గ్రామ కార్యదర్శులు ఉదయం 9గంటల తర్వాత విధులకు హాజరవుతున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై వివరణ ఇవ్వాలంటూ కలెక్టర్ సదరు కార్యదర్శులకు నోటీసులు అందించారు.

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి క్షేత్రంలో ఈనెల 10 నుంచి ప్రారంభం అయ్యే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించే స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనేగల శ్రీమఠం యాగశాల స్థలాన్ని ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారుల సలహాలు, అభ్యర్థనల మేరకు మొదటిసారి స్వామి వారల కల్యాణోత్సవాన్ని దేవాలయం లోపల శేషప్ప కళావేదికపై గాకుండా బయట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో అగ్రహారం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో భాగంగా వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. హైదారాబాద్‌లోని రీసెర్చ్ రూసా సెంటర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ కరుణ ఆధ్వర్యంలో ఎనాలసిస్ ఆఫ్ ఫైటో కెమికల్స్ ఇన్‌సమ్ వెజిటెబుల్స్ అండ్ ఫ్రూట్స్ అనే అంశంపై రూపొందించిన స్టడీ ప్రాజెక్టును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్పించి న్యాయనిర్ణేతల మన్ననలను పొందారు. కాగా విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటుగా వైస్‌ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు కృష్ణప్రసాద్, ప్రసాద్, శోభారాణి తదితరులు అభినందించారు.

చీకోడ్‌లో క్షయ గుర్తింపు శిబిరం

ముస్తాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకోడ్‌లో గురువారం క్షయ గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ బత్తుల గీతాంజలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో యాదగిరి, లక్ష్మీప్రసాద్, ఏఎన్ఎం వసంత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- గోదావరి జలాలకు పూజలు చేసిన రైతులు, కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఉంటుందని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెలకల తిరుపతి పేర్కొన్నారు. గురువారం మల్యాల పంప్ హౌస్ నుంచి రుద్రంగి మండల కేంద్రానికి గోదావరి జలాలు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి జిల్లాలకు పూజలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో రైతులకు నీటిని విడుదల చేశారని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతుల పక్షపాతి అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు రోడెక్కితే నీటి విడుదల చేసేవారని కానీ ప్రజా ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకమునుపే నీటి విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, ఇప్ప మహేష్, ఎర్రం రాజలింగం, నంద్యాడపు శ్రీనివాస్, ఈర్లం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డప్పు కళాకారుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న డప్పు కళాకారులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలులో లోపాలను సవరించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు కళాకారులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరవింద్, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవోలను సవరించాలి

- కలెక్టరేట్ ఏవోకు సీఐటీయూ నాయకుల వినతి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతన జీవోలను రాష్ట్ర ప్రభుత్వం సవరించడంతోపాటు కార్మికులకు ప్రతినెల రూ26 వేల వేతనాన్ని నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో గురువారం సీఐటీయూ నాయకులు కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే విధంగా కార్మికుల కష్టాన్ని పెట్టుబడిదారులు, యాజమాన్యాలకు దోచిపెట్టే విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. ఒకవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికుల హక్కులను హరించే విధంగా పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు అనుకూలంగా 4లేబర్ కోడ్‌లను తీసుకరావడం జరుగుతుందని, మరోవైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కష్టాన్ని యాజమాన్యాలకు దోచిపెట్టే విధంగా వ్యవహరిస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలను పెంచి సవరించాల్సి ఉన్నప్పటికి గత 12 సంవత్సరాలుగా ఎలాంటి వేతనాల పెంపు చేయకుండా ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి వేతనాల పెంపు లేకుండానే కార్మికులకు నష్టం కలిగించే విధంగా షెడ్యూల్డ్ ఎంపాయిమెంట్స్ కనీస వేతనాల జీవోల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లను విడుదల చేయడం జరిగిదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్ ఎంప్లాయి మెంట్స్‌లో కనీస వేతనాల జీవోలను పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు అనుకూలంగా షెడ్యూల్డ్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం చేసే విధంగా డ్రాఫ్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోల డ్రాఫ్టలను సవరించి కనీస వేతనం రూ26 నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జిందం కమలాకర్, బెజుగం సురేష్, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.